క్లుప్తంగా

నూరు శాతం చెత్త సేకరణ చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో నూరు శాతం చెత్త సేకరణ జరగాలని, ఆ దిశగా అధికారులు, సిబ్బంది పని చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. గంగానమ్మపేటలో శనివారం పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. తెనాలిలో మూడు బుట్టల విధానం సక్రమంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా రోడ్లు, కాల్వల్లో చెత్త వేయకుండా సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

కేజీఎఫ్ తెనాలి చాప్టర్ అధ్యక్షుడిగా నాని



జెట్టి శివరామకృష్ణ ప్రసాద్

తెనాలి: కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) తెనాలి చాప్టర్ అధ్యక్షులుగా పట్టణ అయితానగర్‌కు చెందిన జెట్టి శివరామకృష్ణప్రసాద్ (నాని) నియమితులయ్యారు. కేజీఎఫ్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడైన జెట్టి కుసుమకుమార్ ఈ ప్రకారం నియామకపత్రం పంపారు. తెనాలి చాప్టర్ అధ్యక్షుడిగా ఉంటూనే గుంటూరు జిల్లాలో కేజీఎఫ్ సభ్యత్వ నమోదు డ్రైవ్‌ను పర్యవేక్షించాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

ఎడ్ల బలప్రదర్శన ఏర్పాట్ల పరిశీలన

తెనాలిరూరల్: ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ట్రస్టు పేరున ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వరకు జరగనున్న ఎడ్ల బల ప్రదర్శన ఏర్పాట్లను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం పరిశీలించారు. అనుచరులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన అధునాతన సాంకేతిక పనిముట్లు, హార్టి కల్చర్ వర్క్‌షాప్‌లు ఔషధ మొక్కలు ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

25న క్రెడిట్ క్యాంప్

కర్లపాలెం: బీసీ కార్పొరేషన్ రుణాలకు ఈనెల 25న కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో క్రెడిట్ క్యాంప్ నిర్వహిస్తామని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈబీసీ, కాపు కులాలకు చెందిన వారంతా హాజరుకావాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, ఆధార్, రేషన్‌కార్డులతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలిపారు.

పిట్టలవానిపాలెంలో...

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారందరూ ఈనెల 25న పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగే క్రెడిట్ క్యాంపుకు హాజరుకావాలని ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు శనివారం ప్రకటనలో కోరారు. బీసీ, ఈబీసీ, కాపు కులస్తులకు జరిగే క్రెడిట్ క్యాంపుకు వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుదారులంతా ధ్రువీకరణ పత్రాలు తీసుకుని క్రెడిట్ క్యాంపుకు హాజరవ్వాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



చెరుకుపల్లి: మండలంలోని గుళ్లపల్లి జాతీయ రహదారి పక్కన గ్రామానికి చెందిన నాన్నగారు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పొన్నపల్లి సత్యనారాయణ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంఈఓ పులి లాజర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నాన్న గారు స్వచ్ఛంద సంస్థ పేదలకు, పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె మార్కెటింగ్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఉల్లంగుంట శ్రీరాంమూర్తి, వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు వంగరు భాను, పొన్నపల్లి వినీల, ఉల్లంగుంట రామారావు, కొక్కిలిగడ్డ వీర్రాజు, బొర్రా సాయిబాబు, ఉల్లంగుంట సాంబశివరావు, జొన్నాదుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వేమూరు: భట్టిప్రోలు మండలంలోని కేఎస్‌కే విద్యా సంస్థలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ రాజేష్ విక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి కళ్లజోళ్ల పంపిణీతో పాటు ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయించనున్నట్లు వెల్లడించారు. గ్రామస్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జోరుగా కొబ్బరి బొండాల అమ్మకాలు

- ఎండ వేడి నుంచి ఎంతో ఉపశమనం
- బొండాం కనీస ధర రూ.25
- అరలీటరు బాటిల్ రూ.50
- లీటరు రూ.100 కు అమ్మకాలు



కొల్లిపర ప్రధాన కూడలిలో కొబ్బరి బొండాలు విక్రయాస్తున్న వ్యాపారి

కొల్లిపర: ప్రస్తుతం గ్రామంలో, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా ముందస్తుగా వచ్చిన వేసవి కాలంతో వేసవి తాపం రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ప్రజలు దాహార్తి తీర్చుకునేందుకు మధ్యాహ్నం సమయంలో ఎక్కువ శాతం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇటువంటి సమయంలో సూర్య ప్రతాపం నుంచి ఉపశమనం పొందాలంటే బయట వాతావరణం నుంచి శరీరం గ్రహించిన వేడిని తగ్గించాలి.

అందుకు ప్రస్తుతం కొబ్బరి బొండాల నీరే మంచి ఆరోగ్యసూత్రంగా ప్రజలు భావిస్తున్నారు. కొబ్బరి నీటిలో విటమిన్లు, మినరల్స్, ఎలక్ట్రోలైట్స్, ఎంజైమ్‌లు, ఎమినోయాసిడ్లు, సైటోకిన్ అధికంగా ఉంటాయి. శరీరానికి వేసవి నుంచి ఉపశమనం ఇచ్చే కొబ్బరి నీళ్లు రుచికి వగరుగా, తియ్యగా ఉన్నా వగరుగా ఉన్న నీరు వలన ఆరోగ్యానికి ప్రయోజనాలను ఎన్నో కల్పిస్తున్నాయి.

ఫ్లూయిడ్స్ మళ్లీ భర్తీ

కొబ్బరి నీరు తాగడం వల్ల శరీరం నష్టపోయిన ఫ్లూయిడ్స్‌ను భర్తీ అవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ఏడాది వేసవిలో ఉదయం 8 గంటల వరకు సాదాసీదాగా ఉన్నప్పటికీ అక్కడి నుంచి ఎండతీవ్రత ఎక్కువగా ఉంటోంది. బయటకు వచ్చి తిరిగిన వారు ఉష్ణతాపాన్ని తట్టుకునేందుకు చల్లని పానీయాల కోసం పరుగులు తీస్తున్నారు.

విస్తృతంగా వ్యాపారం

కొబ్బరి బొండాల వ్యాపారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రధాన కూడలిలో విస్తృతమవుతోంది. వేసవితాపం పెరగడంతో చిరు వ్యాపారులు కొబ్బరి బొండాలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వాటిని గ్రామాల్లో విక్రయిస్తున్నారు. వేసవి సమయంలో కాకుండా ఇతర సమయాల్లోనూ కొబ్బరి బొండాల విక్రయాలు సాధారణంగా జరుగుతున్నాయి. సీజనల్‌గా చిరు వ్యాపారులు ఎక్కువవుతున్నారు. కొబ్బరి బొండాలను సైకిళ్లు, మోటారు సైకిళ్ల మీద, బల్ల రిక్షాలపైన, ఆటోల పైన పెట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో బొండాం కనీస ధర రూ.25 ఉంటోంది. అరలీటరు అయితే రూ.50, లీటరు అయితే రూ.100 వ్యాపారులు అమ్ముతున్నారు.

దూర ప్రాంతాల నుంచి దిగుమతి

కొబ్బరి బొండాలు స్థానికంగా అందుబాటులో లేక పోయినా లంకగ్రామాల్లో, లేదా ఇతర ప్రాంతాల్లో ఎక్కువ రేటు చెల్లించి బొండాలు తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. వేసవివల్ల కొబ్బరి బొండాల విక్రయాలు ఎక్కువగా ఉంటాయి. డిమాండ్ బాగా ఉంది.

–దాసరి హరిబాబు, వ్యాపారి, కొల్లిపర

శీతలపానీయాల కన్నా...

శీతల పానీయాలు సేవించే కన్నా కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ వంటి పానీయాలు తీసుకోవడం మేలని వైద్యులు, వయో వృద్ధులు సూచిస్తున్నారు. కొబ్బరి నీళ్లలో ఎలక్ట్రోలైట్ పొటాషియం అధికంగా కలిగి ఉంటుంది. దీని వల్ల కొబ్బరి నీళ్లు తీసుకోవటం వలన శరీర ద్రవాల్లో ఎలక్ట్రోలైట్‌ని తిరిగి భర్తీ చేస్తుందని సూచిస్తున్నారు. కొబ్బరి నీటిలో పొటాషియం ఎక్కువగా ఉండడం వల్ల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ నీరు వారంలో కనీసం రెండుసార్లు తీసుకోవటం వలన గుండెపోటు ప్రమాదాలను తగ్గించడానికి ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

29న స్వరలయ వేదిక రజతోత్సవ వేడుకలు

వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాల ప్రదానం



మాట్లాడుతున్న సాయి లక్కరాజు

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయవేదిక ఆధ్వర్యంలో రజతోత్సవ ఉగాది వేడుకలను ఈనెల 29న నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు వెల్లడించారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో విశ్వావసునామ సంవత్సర ఉగాది పురస్కారాలను వివిధ రంగాల్లోని ప్రముఖులకు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. మారీసుపేటలోని సంస్థ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. స్వరలయవేదిక నిర్వహణలో గత 24 ఏళ్లుగా ఉగాది వేడుకలను జరుపుతూ, లబ్ధప్రతిష్ఠులకు పురస్కారాలను బహూకరిస్తున్నట్టు గుర్తుచేశారు. ఈ ఏడాది రజతోత్సవ ఉగాది వేడుకల్లో సేవ, కళ, సంగీత, పరిశోధన, నృత్య రంగాలకు చెందిన ప్రముఖులు ఈదర వెంకట పూర్ణచంద్, షేక్ తిరుమలాబి, కొండపి వసుంధర, డాక్టర్ దాసరి విజయలక్ష్మి, వసంతదుర్గకు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. ముఖ్యఅతిథి, రాష్ట్ర రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆధ్యాత్మిక ప్రవచకులు గుడిమెళ్ల శ్రీకూర్మనాథ్, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు అవార్డుగ్రహీతలను సత్కరిస్తారని తెలిపారు. పిరమిడ్ యోగ సాధకుడు డాక్టర్ జాస్తి వేంకటసుబ్బారావు ధ్యానంపై ఉపన్యసిస్తారు. తన సంకలనంలో వెలువరించిన 'మన పండుగలు', 'విశ్వవిజేతలు' పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో డీవీ సుబ్రమణ్యేశ్వరరావు, విశ్రాంత పోస్టల్ అధికారి తిరుమలరావు, నటుడుమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

డీఎస్పీ జనార్ధనరావు



బహుమతి ప్రదానం చేస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

తెనాలిటౌన్: క్రీడలు మనిషి శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని డీఎస్పీ బి.జనార్ధనరావు పేర్కొన్నారు. స్థానిక షరాఫ్‌బజార్‌లోని శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ బి.జనార్ధనరావు హాజరయ్యారు. ఫిబ్రవరి నెలలో శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలైన రాయల్ ఛాలెంజ్‌కు టీంకు మొదటి బహుమతిగా రూ.10వేలు, ట్రోఫీ, రన్నర్ టీంకు రూ.5000లు, ట్రోఫీ డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఏర్పాటు చేసి యువతను క్రీడల్లో ఉన్నతంగా రాణించేలా ప్రోత్సహించడం అభినందనీయమని డీఎస్పీ కొనియాడారు. అనంతరం స్వర్ణకార సంఘ సభ్యులకు ఐడెంటిటీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి షేక్ నాసర్ అహ్మద్, కోశాధికారి మునగాల శ్రీనివాస్, జిల్లా ప్రెసిడెంట్ తాడేపల్లి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మొహిద్దీన్, 19వ వార్డు కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖుద్దూస్, వెండి అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.ఫజిల్ ఖాన్, కార్యదర్శి పఠాన్ జిలానీ ఖాన్ పాల్గొన్నారు.

సూచనల మేరకే ఎరువులు వినియోగించాలి

ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, డాక్టర్ ఎస్ వెంకటలక్ష్మి

అత్తోట(కొల్లిపర): రైతులు పంటలు సాగు చేసే ముందు పంట భూమి నుండి కొంత మట్టి స్వీకరించి వ్యవసాయాధికారుల చేత మట్టి పరీక్షలు నిర్వహించి ఫలితాలు అనంతరం ఆ పంటలకు అధికారులు సూచనలు ప్రకారం ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం వారి ఆధ్వర్యంలో మండలంలోని అత్తోట గ్రామంలోశనివారం ఆర్ఏయ్యుఈపీ విద్యార్థుల చేత నేల ఆరోగ్యం పరిరక్షణలో భూసార పరీక్షల అవశ్యకత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేల ఆరోగ్యం, తాగునీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, రైతులు వ్యవసాయాధికారుల సూచనలు ప్రకారం పంటలు, ఎరువులు వాడాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత డాక్టర్ ఎం.వెంకట రాములు, ప్రధానోపాధ్యాయురాలు వై.భారతి, ఉపాధ్యాయులు దేవదాసు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

అధికారులు.. పనితీరు మార్చుకోండి

- ఫంగస్ చేరిన నీరు సరఫరా చేస్తారా?
- నీటి పరీక్షలు చేసే వ్యక్తి గుంటూరులో ఉంటాడా?
- మే 15 లోపు లోపాలు సరిచేసుకోండి!
- ఇంజనీరింగ్ సిబ్బందికి మంత్రి మనోహర్ సూచన



సరఫరా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్

తెనాలిఅర్బన్: రూ.95 కోట్లతో తెనాలి తీసుకువచ్చిన రక్షిత మంచినీటి పథకం అస్తవ్యస్థంగా తయారైంది. నిర్వహణలో లోపాలు ఉండటం వలన అక్కడక్కడ ఫంగస్ చేరింది. అలాంటి వాటర్‌నే ప్రజలకు అందించడం దుర్మార్గమంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఎస్సార్ కళాశాల రోడ్డులోని రక్షిత మంచినీటి సరఫరా కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఆవరణలో అక్కడక్కడ టైల్స్ ఊడిపోవడం, ఫంగస్ చేరి ఉండటాన్ని గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. అలాగే నీటి పరీక్షలు రోజుకు మూడుసార్లు చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కనీసం పరీక్షలు కూడా చేయకుండా ఎలా నీటి సరఫరా చేస్తున్నారని ప్రశ్నించారు. నీటి పరీక్షలు చేసే వ్యక్తి గుంటూరులో నివాసం కలిగి ఉండటాన్ని తప్పుబట్టారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథక సరఫరా కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. కనీసం ఇన్‌ఛార్జి ఎంఈ, ఇతర అధికారులు కూడా దానిని వారానికి ఒకసారి పరిశీలించడం లేదనే విషయం నిర్ధారణ అయినట్లు చెప్పారు. మే 15 లోపు సరఫరా కేంద్రాల్లోని లోపాలని సరిచేయాలని ఆదేశించారు. ముందుగా ఆయన మున్సిపల్ అధికారులతో తన కార్యాలయంలో సమీక్ష జరిపారు. అనంతరం ఐతానగర్‌లోని చెరువును పరిశీలించి అక్కడ చేయాల్సిన అభివృద్ధిపై చర్చించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఏసీపీ శివన్నారాయణ, ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, పలువురు డీఈలు, ఏఈలు, టీపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'శిశిరం' చిత్రం రెండవ షెడ్యూల్

- పట్టణ, పరిసర గ్రామాల్లో మూడురోజులు చిత్రీకరణ
- చిత్ర దర్శకుడు కనపర్తి రత్నాకర్ వెల్లడి



కనపర్తి రత్నాకర్

తెనాలి: శ్రీకృష్ణ ఆర్ట్స్ పతాకంపై తెనాలి, పరిసరాల్లో చిత్రీకరణ జరుపుకుంటున్న బాలల సినిమా 'శిశిరం' రెండో షెడ్యూల్ ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్టు చిత్ర దర్శకుడు కనపర్తి రత్నాకర్ వెల్లడించారు.

స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, తాజా షెడ్యూలు ఆటోనగర్‌లోని సూర్య శిల్పశాల, బుర్రిపాలెంరోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్, రూరల్ మండలం సంగం జాగర్లమూడి, శేకూరు, కొలకలూరు గ్రామాల్లో మూడురోజులు జరుగుతుందని చెప్పారు. విద్యావ్యవస్థ ప్రధానాంశంగా చిత్రం ఉంటుందన్నారు. ప్రముఖ బాలనటుడు 'తండేల్' ఫేమ్ లిటిల్ స్టార్ భానుప్రకాష్, మాస్టర్ పుష్కర్, బేబి అమృత, ప్రిహాన్స్ సిస్టర్స్ ప్రధాన బాలనటులు కాగా, స్థానిక కళాకారులు బెల్లంకొండ వెంకట్, కనపర్తి మధుకర్, సోమేష్, కోటేశ్వరరావు, గోము, వసంతయామిని, తులసి, ప్రియాంక, డాక్టర్ జీవనలత, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, రచయిత అయినాల మల్లేశ్వరరావు వివిధ పాత్రల్లో నటిస్తున్నారని చెప్పారు. శిశిరం చిత్రంలోని పాటలు ప్రసిద్ధ మ్యూజిక్ సంస్థ ఆదిత్య మ్యూజిక్‌తో విడుదలై, శ్రోతల ఆదరణ పొందాయని గుర్తుచేశారు. తెనాలికి చెందిన యువ సంగీత దర్శకుడు శాండీ అద్దంకి సంగీతం సమకూర్చినట్టు తెలిపారు. కథ, స్క్రీన్ ప్లే వెంకట్‌ప్రసాద్, డైరెక్టర్ అఫ్ ఫోటోగ్రఫీ ఎం.మురళీకృష్ణ, కెమెరా డి.మధు, స్టిల్స్ ఎస్.ఎస్.వి శేఖర్, డి.నాగరాజు, చరణ్ లు, ప్రొడక్షన్ డిజైనర్ ఎం.శ్రీకాంత్, కో–డైరెక్టర్ రావూరి రమణ, అసియేట్ డైరెక్టర్ వర్ధన్ రాజ్ లు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి కో–ప్రొడ్యూసర్లుగా వెంకట్‌ప్రసాద్ అమిరినేని, సాదు చలపతి, కన్నెగంటి రవి, అనిల్ మూకిరి వ్యవహరిస్తున్నట్టు వివరించారు.

ఆకట్టుకున్న 'టెస్ట్ యువర్ చైల్డ్' ప్రదర్శన

రేపల్లె రూరల్: పట్టణంలోని భాష్యం స్కూలులో టెస్ట్ యువర్ చైల్డ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యా సంవత్సరంలో నేర్చుకున్న పాఠ్యాంశాలను చిన్నారులు తల్లిదండ్రులకు ఎదుట ప్రదర్శించారు. చిన్నారులలో సృజనాత్మకత పెరిగేలా, కొత్త ఆలోచనలు రేకెత్తించేలా టెస్ట్ యువర్ చైల్డ్ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ధాంప్స్ హెచ్ఎం ఇందిర, ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంధ్రాప్యారిస్‌లో చారిత్రాత్మక జామియా మసీదు

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా...



జామియా మసీదు



విద్యుత్ వెలుగుల్లో శోభాయమానం

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలి విలక్షణమైన పట్టణం. విద్య, కళలు, సాహిత్యం విరాజిల్లటమే కాదు... విభిన్న మతాలు, కులాలకు నిలయంగా మతసామరస్యానికి ప్రతీకగా కొనసాగుతోంది. సుమేరియన్ నాగరికతా కాలంనాటిదిగా చెప్పుకునే పట్టణంలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన దేవాలయాలు ఎన్నో ఉన్నాయి. చారిత్రాత్మకమైన ప్రార్థనాలయాలూ ఆయా మతాలకు సంబంధించిన కార్యకలాపాలకు నిలయంగా వర్ధిల్లుతున్నాయి. వీటిలో శతవసంతాలకు పైగా చరిత్ర కలిగి, వివిధ ప్రత్యేకతలతో కూడిన జామియా మసీదు ఒకటి. రంజాన్ మాసంలో విశిష్టమైన జామియా మసీదు వివరాలను తెలుసుకోవటం సందర్భోచితం...

పట్టణంలో ముస్లిం జనాభా చెప్పుకోదగిన సంఖ్యలో ఉంది. దాదాపు 25 వేలకు పైగా ఓటర్లు ఇక్కడున్నట్టు అంచనా. వీరి ప్రార్థనా అవసరాలకు తగినట్టుగా వివిధ ప్రదేశాల్లో 22 మసీదులున్నాయి. పవిత్ర రంజాన్ మాసంలో ఈ మసీదుల శోభ ద్విగుణీకృతంగా ఉంటుంది. బుర్రిపాలెంరోడ్డులో పాత ప్రభుత్వ ఆసుపత్రికి సమీపాన గల జామియా మసీదు 18వ శతాబ్దానికి చెందిన ప్రాచీనమైందిగా పెద్దలు చెబుతారు. మసీదు ఎప్పుడు నిర్మించారనే అంశంపై భిన్నాభిప్రాయాలున్నా, పట్టణంలో తొలి ప్రాచీన మసీదు అనే విషయంలో ఎలాంటి సందేహం లేదని అందరూ అంగీకరిస్తారు.

గాంధీనగర్ పరిధిలో ఒకప్పుడు చిన్నదిగా ఉన్న మసీదును, అక్కడ ముస్లిం జనాభా పెరగటంతో ఆధునికీకరణకు చర్యలు తీసుకున్నారు.1995 ప్రాంతంలో నాటి గుంటూరు జిల్లా కలెక్టర్ అనుమతితో జామియా మసీదును ఆధునీకరించారు. మసీదును విస్తరించి, ఆధునిక శైలిలో పలు మార్పులు చేశారు. విశాలమైన స్థలం, మూడు అంతస్తులతో ముస్లిం సోదరులకు అందుబాటులోకి వచ్చింది. నాలుగు మినార్లు నిర్మించారు. నిర్ణీత వేళల ప్రకారం ఇక్కడ ప్రార్థనలు జరుగుతుంటాయి. పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి శుక్రవారం మసీదు ప్రాంగణం, అందులోని షెడ్లు, మూడు అంతస్తుల్లోనూ దాదాపు వెయ్యి మంది ముస్లిం సోదరులు ప్రార్థనలు చేస్తుంటారు. హాఫీజ్ మహమ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఇక్కడ ప్రార్థనలు జరుగుతాయి. ఖాజా అస్లామ్‌ఖాన్ ఇక్కడ 38 ఏళ్లుగా మౌజాన్‌గా ఉన్నారు. భాషా అనే మరో మౌజాన్ కూడా ఇక్కడ బాధ్యతలో ఉన్నారు. మసీదులో ఏర్పాటు చేసిన భారీ డిజిటల్ గడియారం ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు సమయాన్ని తెలియ జేస్తుంటుంది. రాత్రి సమయాల్లో ఈ మసీదు విద్యుత్ కాంతులను విరజిమ్ముతూ ఆకర్షణీయంగా కనిపిస్తుంది. మసీదు ప్రాంగణంలో గల ఆరు దుకాణాల్లో వచ్చే అద్దెలు మసీదు నిర్వహణకు వినియోగిస్తారు. ఆసక్తి కలిగిన ముస్లిం విద్యార్థులకు పాఠశాల లేని ఖాళీ సమయాల్లో అరబ్బీ

భాషను ఉచితంగా నేర్పిస్తుంటారు.

జామియా మసీదు హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. సాయంత్రం మగ్రీబ్ నమాజ్ సమయానికి పలువురు హిందువులు రోగబాధితులుగా ఉన్న తమ చిన్నారులను తీసుకుని మసీదు ప్రాంగణంలో వేచివుంటారు. నమాజ్ పూర్తిచేసుకుని మసీదు నుండి బయటకు వచ్చే వయోవృద్ధులైన నమాజీలు దివ్య ఖురాన్‌లోని పవిత్ర సూరాలలోని ప్రవచనాలను ఉచ్చరించి, ఆ పవిత్ర ఉచ్చారణతో కూడిన గాలిని నోటితో చిన్నారుల ముఖంపై ఊదుతారు. ఇలా ఊదితే తమ బిడ్డలకు వ్యాధులు నయమవుతాయని పలువురి విశ్వాసం. అందుకే సాయంత్రం వేళ ఇక్కడ ఈ కార్యక్రమం దశాబ్దాలుగా కొనసాగుతోంది.



ప్రార్థనలు ముగించి వస్తున్న ముస్లిం సోదరులు



స్వస్థత కోసం మసీదు వద్దకు తీసుకొచ్చిన చిన్నారి

రేపు మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

రేపల్లె రూరల్: పట్టణంలో సమస్యల పరిష్కార సాధనకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పి.హెచ్. మణిలాల్ పిలుపునిచ్చారు. ధర్నా నేపథ్యంలో పట్టణంలో శనివారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని, రోడ్లు, తాగునీరు, డ్రెయిన్లు, వీధి దీపాలు తదితర సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ రోజువారి పనులు చేసుకునే పలువురు పేదలు పట్టణానికి గత 30 ఏళ్లలో పెద్దఎత్తున వలస రావటంతో ఇళ్ల స్థలాల సమస్య పెరిగిందని చెప్పారు. అవసరమైన వారికి రెండు సెంట్లు చొప్పున నివేసన స్థలాలు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు వై.కిషోర్, కె.రమేష్, ఆశీర్వాదం, అగస్టిన్, నవీన్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే సహించేది లేదు

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే సహించేదిలేదని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ తెలిపారు. అక్రమంగా ఏర్పాటు చేస్తున్న వైన్‌షాపులను ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ దివాకర్‌కు వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. మద్యం దుకాణాలు విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలన్న నిబంధనను అతిక్రమించి రేపల్లె పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో వైన్‌షాపును ఏర్పాటు చేయటం తగదని తెలిపారు. పేటేరులో ఇళ్ల మధ్య దుకాణాన్ని ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల ముఖద్వారానికి 70 మీటర్ల సమీపంలో ఉన్న ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాన్ని ఏర్పాటు చేయటం ఏమిటని ప్రశ్నించారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : నందికొట్కూరు
O.S.No: 42 OF 2021
కోర్టు వారి ఉత్తర్వు/సూచనల మేరకు
షేక్ మాలిక్ బాష ..వాది
-Vs-
ఎ.సుధాకర్ ..ప్రతివాది

Summons to the Defendant:

ఎ.సుధాకర్, తండ్రి ఎ.శేషయ్య, వ్యాపారం, ఇంటి.నెం: 10-4-1, వార్డు నెం: 28, K.S.M.H స్కూల్ దగ్గర, చెండుపేట, తెనాలి టౌన్ మరియు మండలము, గుంటూరు జిల్లా.

పై వాది, పై కోర్టు నందు ప్రతివాది అయిన మీపై తనకు చెక్కు దార రావలసిన బాకీని రాబట్టుకొనుటకు పై దావాను దాఖలు చేసియున్నాడు. పైన కనబరచిన కేసులో ప్రతివాది అయిన నీకు ఎన్నిసార్లు సమనులు పంపినను నీవు తీసుకోనందువల్ల కోర్టు వారు పై కేసును 08.04.2025న నీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున నీవు తేది: 08.04.2025 నాడు ఉదయం: 10:30 గం॥లకు గౌరవనీయులైన పై కోర్టు వారి ఎదుట హాజరై నీ అభ్యంతరములు స్వయంగా కానీ లేదా నీ తరపు న్యాయవాదుల ద్వారా కానీ తెలియజేసుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
నందికొట్కూరు, వాయిదా తేది: 08.04.2025.

సి.సి.వి.రంగ రెడ్డి, న్యాయవాది
సుబ్బారావు పేట, నందికొట్కూరు.
సెల్: 94410 32210.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



నిజాంపట్నం: మండలంలోని ఆముదాలపల్లి పంచాయతీ కొమరవోలు నుంచి కళ్లిఫలం గ్రామానికి వెళ్లేందుకు రేపల్లె మెయిన్ డ్రెయిన్‌పై రూ.8.20కోట్లతో వంతెన, రహదారి నిర్మాణానికి టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణంతో చెక్కావారిపాలెం నుంచి కొమరవోలు గ్రామానికి రాకపోకలు సాగించేవారికి, వరి, ఆక్వా రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, కృష్ణ పశ్చిమ డెల్టా సాగునీటి ప్రాజెక్టు చైర్మన్ పంతాని మురళీధరరావు, నాయకులు కొలసాని రాము, రాగం కల్యాణ్, నల్లపాటి ఎల్లయ్య, ప్రజ్ఞం, చెక్కవారిపాలెం, కొమరవోలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.